


# కన్నీరింకని కథలు

- షర్మిల



## వివర్ణం

స్టాన్ ఫర్డ్ హాస్పటల్ లాంజ్ నిశ్శబ్దంగా వుంది. ఎవరికి వారు వాళ్ళ ఫోన్లు చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్నట్టున్నారు గానీ ముఖాలన్నీ వాడిపోయి వున్నాయి.

అవంతి సోఫాలో తల వెనక్కి  ఆన్చుకుని వుంది. కళ్ళ నుంచి జారి ఎండిపోయిన కన్నీటి చారికలు. ఎవరూ ఎవర్నీ ఓదార్చుకోవడం లేదు. అసలేం జరుగుతోందో కూడా వాళ్ళకి అర్ధం కావడం లేదు.

రాజీవ్ ఒక పక్కగా నుంచుని నెమ్మదిగా ఇండియాలో తన కంపెనీ  మానేజర్లతో ఫోన్స్ అటెండ్ అవుతున్నాడు. అవంతి లేచి నిలబడింది ఆమె వయసు 50 ఏళ్ళు కానీ 40 ల్లో వున్నట్టుంది. ఐశ్వర్యం, అందం కుప్పపోసినట్టు వుంది.

బిడ్డ ఆఖరిక్షణాలు లెక్కబెట్టుకుంటున్న ఈ క్షణాల్లో మాత్రం తనకు అందం ఐశ్వర్యం ఏమీ వద్దు బిడ్డ ప్రాణం ఒక్కటి తనకు వరంగా ఇస్తే చాలని దేముళ్ళని వేడుకుంటూంది.

కూతురు వర్ణ వున్న రూం బయట నిలబడింది. ఆమెకు లోపలివరకూ వెళ్ళేందుకు అనుమతి లేదు. అల్లుడు తమను ఎవరినీ లోపలికి వచ్చి వర్ణను చూసే వీలు లేకుండా చేశాడు.

మార్ఫిన్ ఇంజెక్షన్ ప్రభావంతో మత్తులో వుంది వర్ణ. తన బంగారు తల్లి వర్ణ. మనసారా  ఒక్కసారి హత్తుకోవాలని వుంది. దానిని కన్నప్పుడు తను కన్న కలలు కళ్ళముందే కూలిపోతుంటే గుండె కూడా చిద్రమైనట్టుంది.

తనని చిన్నపిల్లని కోప్పడినట్టు కోప్పడే వర్ణ ఇక వుండదు. తన బిడ్డ శాశ్వత ప్రయాణానికి సిద్ధమవుతుంటే కనీసం కడపటి వీడ్కోలు పలికే రాత కూడా లేదు. కోట్ల ఆస్తి , ఇంద్రభవనాల్లాంటి ఇళ్ళూ , ఖరీదైన కార్లూ , డైమండ్ నగలు ఇవేవీ పనికి రాలేదు.

కూతురు చాకులాంటి కుర్రాడిని ఎంచుకుంది అని మురిసిపోయింది గానీ వాడో మెత్తని కత్తి అని ఊహించలేదు.

"అవంతీ ! ఎంతసేపని అక్కడ నుంచుంటావ్. నా మాట విను హోటల్ కి వెళ్ళి రెస్ట్ తీసుకుని మళ్ళీ వద్దాం. నిన్నంతా ప్రయాణంలోనూ నువ్వేమీ తినలేదు" అంటూ అక్క భుజం మీద చెయ్యివేసి బతిమాలాడు రఘు.

"ఒరేయ్ ! మనం అరచేతిలో పువ్వల్లే పెంచుకున్నాం కదరా. నా కన్నా మామా మామా అని నీ దగ్గరే చేరిక. అది ఇలా చావుబతుకుల్లో కొట్టు మిట్టాడుతూంటే ఏమీ చెయ్యలేకపోతున్నాం“ మళ్ళీ కన్నీళ్ళు వరదలయ్యాయి.

ఇంతలో తన వర్ణ బాబును స్ట్రాలర్ లో వేసుకుని తీసుకొస్తున్న వర్ణ అత్తగారిని చూసి మనవడి కోసం ఒక్క ఉదుటన వెళ్ళింది.

“ ఇప్పుడే పడుకున్నాడు వదిలెయ్యండి ...మళ్ళీ ఏడుస్తాడు“ అన్న అల్లుడి గొంతు.

ఎత్తుకోబోయిన అవంతిని నిరసనగా చూస్తూ కదిలి పోయింది ఆమె.

“లలిత గారూ ! పోనీ వాడ్ని ఇక్కడ వుంచండి మా దగ్గర“ అంటున్నా పట్టించుకోలేదు.

కూతురికి ఆఖరి క్షణాలు సమీపిస్తున్న సమయంలో తగువు పడడం ఇష్టం లేక నిస్సహాయంగా చూస్తూ వుండిపోయింది.

ఇంత జరుగుతున్నా రాజీవ్ ఏమీ మాట్లాడడం లేదు. అవంతి, తను ఏనాడో విడిపోయారు. పిల్లల కోసం కలిసే వారు.

వర్ణ పట్టుబట్టడంతో ఇద్దరూ కలిసి ఆమె పెళ్ళి కనీవినీ ఎరగనంత ఘనంగా జరిపించారు. ఇదిగో ఇప్పుడిలా కలిశారు.

అవంతి కోపంగా హాస్పటల్ డెస్క్ దగ్గరికి వెళ్ళింది. కూతురి దగ్గరికి తనను వెళ్ళనీయమని అడిగింది. భర్తని తప్ప ఎవరినీ రానియొద్దని వర్ణ సంతకంతో వున్న కన్సెంట్ లెటర్ చూపించింది నర్స్ .

“ఓ ! ఈ దౌర్భాగ్యుడు దాన్ని డెత్ బెడ్ మీద కూడా సాధించడం మానలేదన్నమాట“ అవంతి తనలో తనే గొణుక్కుంది.

వర్ణ ఎమ్మెస్ చేయడానికి యూఎస్ వచ్చినప్పుడు క్లాస్మేట్ అంకిత్ తో సాన్నిహిత్యం పెరిగింది. ఎంతో అపురూపంగా చూస్తూ అతను చూపించే ప్రేమకు పొంగిపోయింది.

"అంకిత్ ! నా చిన్నప్పటి నుంచి అమ్మా నాన్నలు ప్రేమగా మాట్లాడుకోవడం చూడలేదు. అమ్మా , నాన్నా నేనూ కల్సి ఎన్నడూ ఒక ట్రిప్ కి గానీ ఒక సినిమాకి గానీ వెళ్ళలేదు. అయితే అమ్మతో లేకపోతే నాన్నతో అంతే . డైనింగ్ హాల్లో కలిసి ఏనాడూ భోజనం చెయ్యలేదంటే నమ్ముతావా ?" అంది.

"వర్ణా ! నీకు ప్రామిస్ చేస్తున్నా మనం అలా వుండం సరేనా. నీకు నేను నాకు నువ్వు" అన్నాడు సున్నితంగా ఆమె బుగ్గ నిమురుతూ.

ఇవన్నీ తల్లికి చెప్పి తను అంకిత్ ను పెళ్ళి చేసుకుంటానని చెప్పింది.

రాజీవ్ కి ఫోన్ చేసి కూతురి సంగతి చెప్పింది.

రాజీవ్ అమెరికాలో వున్న తన ఫ్రెండ్స్ ద్వారా అంకిత్ కుటుంబం గురించి తెలుసుకున్నాడు.

"అవంతీ ! నేను మంచి సంబంధం చూశాను. అంకిత్ ఫేమిలీ గురించి అంత మంచి ఫీడ్ బాక్ రాలేదు" అన్నాడు.

"పైగా పెద్ద ఆస్తిపరులు కూడా కాదంట. నా మాట విను మన వర్ణకి తగ్గ అబ్బాయిని నేను సెలెక్ట్ చేశాను" అన్నాడు.

అవంతి ఇంతెత్తున లేచింది. "సెలెక్ట్ చేయడానికి అది వేసుకునే డ్రెస్ కాదు... ప్రేమించే మనిషి నువ్వెప్పుడు ఎదుటివాళ్ళ మాట వింటావు గనుక , వర్ణకి అంకిత్ చాలా నచ్చాడు. నేను కూడా మొన్న యూఎస్ వెళ్ళినప్పుడు కలిశాను.నేను పోగొట్టుకున్న ఆనందం నా కూతురికి దక్కుతుందనిపించింది. నీలా కనపడిన ఆడపిల్లని వదలని బుద్ధిలేకపోతే అదే చాలు " అంది.

"నువ్వు మాత్రం భర్తే దైవం అని పూజించావ్ మరి." అటునుంచి వ్యగ్యంగా అన్నాడు రాజీవ్.

ఎప్పట్లానే వాదోపవాదాలతో సంభాషణ ముగిసింది.

మొత్తానికి రాజీవ్, అవంతిల స్థాయికి తగ్గట్టు పెళ్ళి చేసారు.

ఎంగేజ్మెంట్ కే రెండుకోట్ల డైమండ్ జ్యూయలరీ కొనడం చూసిన వర్ణ అత్త గారు అంకిత్ తో "మీ అత్త పెళ్ళికి ఇంకెన్ని కొంటుందో ?" అంది గుసగుసగా.

"ఇప్పటికే తనకి చాలా జ్యూయలరీ వుందంట మమ్మీ. మళ్ళీ లేటెస్ట్ కొంటున్నారంట " అన్నాడు.

పెళ్ళయ్యాకా జాబ్ లో జాయినయ్యింది వర్ణ.

ఆమె కలలు కన్న శాంతితో కూడిన ఇల్లు , ఎంతో అన్యోన్యంగా వుండే భర్త , అత్త మామలు సఖ్యత అంతా కలలా వుంది.

కల ఎప్పటికైనా కరిగిపోతుందని వాస్తవం వేరుగా వుంటుందని నెమ్మదిగా తెలియడం మొదలయ్యింది.

అమెరికాలోనే స్థిరపడిన  అత్తమామలు ఎప్పుడైనా వచ్చి వెళ్తుండేవారు.

ఆ సారి వాళ్ళొచ్చి వెళ్ళినాకా అంకిత్ " వర్ణా నీ నగలన్నీ తెచ్చుకోలేదా ? "  అని అడిగాడు.

"నిన్న అత్తయ్య కూడా అడిగారు నీకు తెలుసుగా అంకిత్ నేను సింపుల్ గా వుంటాను , అవన్నీ అమ్మ గోల పడలేక వేసుకుంటా అంతే, పెళ్ళయ్యాక ఇక్కడికి వచ్చే ముందు అన్నీ అమ్మ లాకర్ లో పెట్టేసింది "అంది

"అదే అమ్మ కూడా అడిగింది. మీ అమ్మ కైనా  కామన్సెన్స్ లేదా ?నీకు ఇచ్చినవి ఆమె దాచడం ఏంటి మనం దాచుకోలేమా?"   అని అన్నాడు.

"అయినా మీ అమ్మగారికి నా నగల గురించి ఎందుకు అంకిత్ ఎప్పుడూ అమ్మ గురించి నా దగ్గర తక్కువగా మాట్లాడకు ప్లీజ్. "

అలా చిన్నగా నస మొదలైంది. వర్ణ అనుకున్నదొకటే చిన్న చిన్న వాటికి తగవులు పడి కుటుంబ సంబంధాలను బలహీనపరచుకోకూడదు .

అందుకే "అంకిత్ ఈ సారి అమ్మ వచ్చినప్పుడు తెమ్మంటాను సరేనా?" అంది.

ఈ లోగా ప్రెగ్నెంట్ అయ్యింది.

కూతురిని చూడడానికి అవంతి వచ్చింది. ఆమె వచ్చిన రోజే అంకిత్ వాళ్ళ అమ్మ కూడా వచ్చింది. వర్ణకి తల్లితో మాట్లాడుకునే వీలు కూడా వుండేది కాదు.

అక్కడున్న అవంతి ఫ్రెండ్స్ ప్రతి వీకెండ్ వచ్చి ఎక్కడికో దగ్గరికి తీసుకెళ్ళే వారు.

"మీ అమ్మ ఆ డ్రెస్సింగ్, ఆ తిరుగుళ్ళు ఇదంతా నాకు నచ్చదు "అన్నాడొకసారి.

"అదేంటి అంకిత్ అమ్మ ఎప్పుడూ ఇలాగే వుంటుంది. ఇండియా అయినా ఇక్కడైనా అమ్మకి ఒక సర్కిల్ వుంటుంది ఇక డ్రెస్సింగ్ అంటావా అది తన ఇష్టం మనం ఎవరం జడ్జ్ చేయడానికి "అంది వర్ణ .

"మీ ఫేమిలీ అంతా డిఫరెంట్ లే " అన్నాడు జోక్ గా అన్నట్టు.

దానికి అంకిత్ అమ్మ పగలబడి నవ్వడం చూసి వర్ణకి చిరాకేసి లోపలికి వెళ్ళి పోయింది.

ఆ రోజు ఇంట్లో హెల్ప్ చేయడానికి వచ్చే మెయిడ్ రాలేదు. పొద్దున్న సింక్ నిండా అంట్లు, వంట చెయ్యాలి.

పొద్దున్నే అంకిత్ ఏదో పని వుందని వెళ్ళి పోయాడు.

వర్ణకి వికారం వాంతులతో నీరసంగా వుంది. అవంతే ఆ సామాన్లు డిష్ వాషర్ లో పెట్టగా ఇంకా వున్నవి తోమి వంట చేసింది.

అత్తగారు కనీసం అవతలి పుల్ల తీసి ఇవతల పెట్టలేదు. పైగా సోఫాలో పడుకుని టీవీ పెద్ద సౌండ్ పెట్టుకుని చూస్తోంది.

మర్నాడూ మెయిడ్ రాలేదు.

"అంకిత్ అత్తయ్యని ఫోన్ చేయమను ఈరోజూ రాలేదు పూనమ్. ఆమె నంబర్ ఇవ్వు నేను మాట్లాడతా" అని నంబర్ తీసుకుంది.

ఫోన్ లిఫ్ట్ చేసిన పూనమ్ "ఆంటీ టూ వీక్స్ రావొద్దన్నారు అందుకే వేరే వర్క్ కి వెళ్ళా" అని చెప్పింది.

వర్ణ ఆశ్చర్యపోయింది.

వర్ణ ప్రెగ్నెంట్ అయ్యాక ఆమె అత్తగారే తనకి తెల్సిన వాళ్ళ ద్వారా పూనమ్ ని వర్క్ లో పెట్టడంతో ఆమే మాట్లాడేది ఇప్పటి వరకూ.

అమ్మతో పని చేయించడానికే పని మానిపించారని అర్ధమైంది.

అడుగడుగునా పనివాళ్ళు... హోదా దర్పం ప్రదర్శించే అమ్మ తనకోసం అంట్లు తోమి వంట చేస్తోంది.

"అమ్మా! ఎప్పుడెళ్తున్నావ్?" అంది మర్నాడు.

"అదేంటి పని వుంది వెళ్ళి మళ్ళీ వస్తానంటే ఇంకొన్నాళ్ళు వుండమన్నావు కద !"

"టికెట్ మారుద్దామనుకుంటున్నా" అంది అవంతి.

"వద్దమ్మా వెళ్ళు ...బేబీ పుట్టాకా వద్దుగాని" అంది వర్ణ.

బాబు పుట్టాకా రాజీవ్ కూడా చూడటానికి వచ్చాడు.

"అంకిత్ ! ఇల్లు కొనాలని ఏమైనా ప్లాన్ చేస్తున్నారా ?అనడిగాడు.

"చేస్తున్నాం అంకుల్ డౌన్ పేమెంట్ చూసుకోవాలిగా " అన్నాడు.

" ఎందుకు ఇండియా నుంచి పంపిస్తాం, కానీ చాలా టాక్స్ పోతుందనుకో ...అయినా ఓకే ఏదో మార్గం చూద్దాం ...ఆ ప్రయత్నాల్లో వుండండి " అన్నాడు.

అప్పటి నుంచి ఇళ్ళు చూడడం మొదలెట్టారు.

తరచూ భరించలేని తలనొప్పి వస్తుండడంతో వర్ణ డాక్టర్ అపాయింట్మెంట్ తీసుకుని వెళ్ళింది.

స్కానింగ్ కోసం స్టాన్ ఫోర్డ్ కి పంపారు.

వర్ణ బ్రెయిన్ లో ట్యూమర్ వుందని రిపోర్ట్స్ వచ్చాయి.

ట్రీట్మెంట్ స్టార్ట్ అయ్యింది కెమో థెరపీలు స్టార్ట్ అయ్యాయి.

అవంతికి, రాజీవ్ కి ఈ సంగతి చెప్పలేదు.

మావయ్య రఘుకి ఫోన్ చేసి చెప్పింది.

అంకిత్, అత్తగారూ కూడా బాబును మాత్రం చాలా అపురూపంగా చూసుకుంటారు.

"అంకిత్ ! నాకేమన్నా అయితే బాబు ?"అని కన్నీరు పెట్టుకుంది.

"బాబు నా ప్రాణం అయినా నీకేం కాదు. డాక్టర్ చెప్పారుగా ఆపరేషన్ చేసి కెమోలు ఇస్తే రికవర్ అయ్యే చాన్సెస్ వుంటాయని " అన్నాడు ఆమె నుదిటి మీద ముద్దాడుతూ.

నాలుగు బెడ్ రూం లు ముందు లాన్, పెద్ద బాక్ బాక్ యార్డ్ ఇల్లు చూశాడు.

రాజీవ్ అన్నట్టుగానే డౌన్ పేమెంట్ అరేంజ్ చేశాడు.

ట్రీట్మెంట్ తో నరకం చూస్తున్న వర్ణ తల్లికి తన జబ్బు గురించి చెప్పి పేరెంట్స్ ని రమ్మని గోల చేసింది.

"ఎలాగూ ఇల్లు కొంటున్నాం గృహప్రవేశానికి రమ్మను ఇప్పుడే ఎందుకు? "అన్నాడు అంకిత్ .

"ఇప్పుడు నాకు అసలు ఓపిక లేదు అంకిత్ సింపుల్ గా పాలు పొంగిద్దాం " అంది.

"నేను ఒక మధ్య తరగతి కుటుంబం వాడిని కష్టాల్లో అరకొరగా బతుకు గడిపాను. అందరినీ పిలిచి సెలబ్రేట్ చేసుకోవాలని వుంది " అన్నాడు.

ఏమీ అనలేక సరే అంది.

అవంతి, రాజీవ్ వేర్వేరుగా వచ్చారు.

గృహప్రవేశం అయ్యింది.

రాజీవ్ పని వుందని మళ్ళీ వస్తానని ఇండియా వెళ్ళిపోయాడు.

" ఆంటీ మీతో మాట్లాడాలి " అన్నాడు.

"చెప్పు అంకిత్ !" అంది అవంతి.

"అదే వర్ణ పేరు మీద ఇల్లు రిజిస్టర్ చేస్తామన్నారు కదా. ఆ పేపర్స్ మీరు వెళ్ళాక పంపించండి. సంతకాలు పెట్టించి పంపిస్తాను."

"నీ వుద్దేశం ఏంటి అంకిత్? దాని ఆస్తి దానికే వుంటుంది. ఇప్పుడు తను కీమో థెరపీ తీసుకుంటూ హాస్పటల్ లో పడి వుంది.ఇప్పుడు ఆస్తి గొడవేంటి "అంది గట్టిగా.

"మీరు తను వుండగానే ఇవ్వడం లేదు రేపు తనకి ఏమైనా అయితే ఎగ్గొట్టాలనేగా...వర్ణకి బాబు వున్నాడు వాడికి న్యాయంగా దక్కాలి అని అంతే. " గట్టిగా అరిచాడు.

"మీరు రేపు మీ కొడుక్కి ఇవ్వరని గ్యారంటీ ఏంటి? " అన్నాడు.

"ఆపు అంకిత్ . వర్ణకి ఏం కాదు నువ్వు ఆ మాట ఎలా అనగలిగావ్ ? అసలు వర్ణ కన్నా దాని ఆస్తి నీకు ఎక్కువేమో అనిపిస్తోంది చూస్తే ప్లీజ్ ఇక ఆపెయ్ ఈ మాటలు " అని లేచి వెళ్ళి పోయింది.

హాస్పటల్ నుంచి కూతురు ఇంటికి వచ్చాకా ఇవన్నీ చెప్పాలని అనిపించలేదు.

కానీ అంకిత్ ఏం చెప్పాడో తెలియదు ఆ మర్నాడు వర్ణ అవంతితో అంది "అమ్మా నువ్వు ఇక మారవా ? డాడీ తో గొడవలు పెట్టుకుని విడిపోయావ్ . ఇక మాకు గొడవలు పెట్టకు " అనడం తో అవంతి అయోమయంగా చూస్తూ వుండిపోయింది.

"అమ్మా !గుర్తుంచుకో నేను లేక పోయినా నా కొడుక్కి తండ్రి ప్రేమ అయినా దొరకాలి. నీదగ్గరో ఇంకెక్కడో అనాధగా పెరగడు. నాలా ప్రేమ కోసం అలమటించాల్సిన పరిస్థితి వాడికి రాకూడదు. అందుకే అంకిత్ తోనే జీవితమైనా చావైనా " అనేసి వెళ్ళి పోయింది.

" వర్ణా ! నీకు తెలియదా నువ్వే నా ప్రాణమని " అంటూ ఏడ్చినా పట్టించుకోలేదు.

ఆస్తి కోసం దాని మనసు విరగ్గొట్టాడు. కొన్నాళ్ళు వుండి వెళ్ళిపోయింది.

ఇంకో నెల కూడా గడవలేదు కూతురికి సీరియస్ గా వుందని వేరే బంధువులు ఫోన్ చేస్తే అవంతి రాజీవ్ లకు తెలిసింది.

తాము వస్తున్నామని ఫోన్ చేశారు అంకిత్ కి ...

" వస్తే రండి మీ ఇష్టం ...ఇంట్లో ఖాళీ లేదు , అమ్మానాన్నా చెల్లి అంతా వున్నారు " అన్నాడు.

"పర్లేదు ! మేం ఆతిథ్యం కోసం రావడం లేదు , హోటల్ లో దిగుతాం " అన్నారు.

అక్కని చూడటానికి నేనూ వస్తాను అన్నాడు వివేక్ .

వాళ్ళు వచ్చేసరికే వర్ణ స్పృహలో లేదు. మరణ శయ్య మీద కన్న బిడ్డని చూసే పరిస్థితి పగవారికి కూడా రాకూడదు అంటూ రాజేష్ అవంతీ విలపిస్తుంటే వర్ణ ఈ లోకం వదిలి వెళ్ళి పోయింది.

వర్ణకు తుది వీడ్కోలు ఇచ్చాకా ఇండియా వెళ్ళే ఫ్లైట్ ఎక్కారు.

విమానం గాల్లోకి ఎగిరింది. విండో లో నుంచి కిందకి చూస్తూ

నా మనవడు అమెరికా నుంచి పెద్దయ్యాక వాడే అమ్మమ్మని వెతుక్కుంటూ వస్తాడు.

వాడు వర్ణ వారసుడు. ఆస్తికే కాదు నా ప్రేమ కి కూడా అనుకుంటూ హేండ్ బాగ్ లో వున్న మనవడి ఫొటో చూసుకుంటూ కన్నీళ్ళు అదుముకుంది.

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments